# సాక్షి
## యాదాద్రి భువనగిరి

ఆదివారం । 28 । జనవరి । 2024






**సైదన్నా.. వెళ్లొస్తాం**

మూడు రోజుల పాటు సాగిన జాన్‌పహాడ్ ముగిసింది. సైదన్నా.. వెళ్లొస్తామంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. - 8లో



**రాజకీయాలకు తావు లేదు**

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు ఏమాత్రం తావులేదని ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 9లో



**ప్రతి పేదవాడికి పథకాలు**

ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో



## యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు,, శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు.అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన జరిపించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు



**యువసాయం**

ఉన్నత చదువులు పక్కనపెట్టి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి పొలంబాట పట్టారు. ఆధునిక పద్ధతులతో సేద్యం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. భూక్య బిచ్చునాయక్, రమావత్ బాలకృష్ణ. - ప్రత్యేక కథనం 8లో ▶

### న్యూస్‌రీల్

## టీఎన్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ



భువనగిరిటౌన్ : నాన్ గెజిటెట్ ఉద్యోగుల సంఘం(టీఎన్‌జీఓ) జిల్లా ఉపాధ్యక్షురాలిగా భువనగిరికి చెందిన ఎనుగు చంద్రకళారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీఎన్‌జీఓ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు యం.శ్రవణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రకళారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన నియమానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, సంఘం నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## 'భావితరాలకు స్ఫూర్తిదాయకం కూరెళ్ల'



కూరెళ్ల విఠలాచార్యకు విరాళం అందజేస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు, నాయకులు

రామన్నపేట : కూరెళ్ల విఠలాచార్య భావితరాలకు స్ఫూర్తిదాయకం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీ శ్యాంసుందర్‌రావు పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కూరెళ్ల విఠలాచార్యను వెల్లంకి ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలో శనివారం స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. గ్రంథాలయ నిర్వహణకు రూ.30 వేలు విరాళంగా అందజేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోనే అతి పెద్ద గ్రంథాలయంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, నియోజకవర్గ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య, అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, కోకన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శ్యాం, మండల అధ్యక్షుడు తాటిపాముల శివక్రిష్ణ, చింతల రామక్రిష్ణ, శానగొండ మల్లికార్జున్, పల్లపు దుర్గయ్య, చిక్క బాబురావు, గట్టు బాల్‌రెడ్డి, జువ్వగోని మధు, బట్టి రమేష్, పోచబోయిన ఆంజనేయులు పాల్గొన్నారు.

## అనువైన పంటలు వేయాలి



అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త

మోటకొండూర్ : క్షేత్రస్థాయిలో భూములు, పంటలు, చీడపీడలు, మార్కెటింగ్ అంశాలను తెలుసుకునేందుకు వ్యవసాయ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎంతో మేలు జరుగుతుందని ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. సాగు విధానాలపై ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మోటకొండూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. భూమి, వాతావరణానికి, నీటి వనరులకు అనుగుణంగా పంటు వేయాలన్నారు. విత్తనాలు, ఎరువుల దుకాణాలు, మార్కెటింగ్ వసతులపై చిత్రాల ద్వారా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, విద్యార్థులు పుట్టపాక సౌమ్య, సబాబేగం, హుడా నిలోఫర్, షాలిని విసెట్టి, మద్దూరి హన్సికారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్ : ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని, అందుకోసం ప్రభుత్వం నుంచి వచ్చే నెలవారి పారితోషికంతో పాటుగా ఇంకేమి వచ్చినా వారికోసమే ఖర్చు చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ, కురుమ సంఘ భవనం, రైతువేదిక భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజ్ గౌడ్, గుండ్లపల్లి భరత్ గౌడ్, సర్పంచ్ బీర్ల శంకర్, ఉపసర్పంచ్ దుంబాల సురేఖ వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్, ఏవో రాజేష్ కుమార్, ఏడీఏ పద్మావతి, కోఆప్షన్ సభ్యులు ఎండీ యాకుబ్ పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో బదిలీలు

**17 మంది సీఐలు, ఎస్‌ఐలకు స్థానచలనం**

- త్వరలో మరికొందరు..
- పార్లమెంట్ ఎన్నికల నిబంధనలా.. బీఆర్‌ఎస్‌కు అనుకూలమనా?
- బదిలీలపై సర్వత్రా చర్చ
- అనుకూల వ్యక్తులకు పోస్టింగ్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో నేతలు




సాక్షి, యాదాద్రి : భువనగిరి జోన్ పరిధిలో భారీగా పోలీసు అధికారుల బదిలీలు జరిగాయి. ఒక్క రోజే 17 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల మేరకు జరుగుతున్న బదిలీలు అని చెబుతున్నా.. లోపాయికారంగా వేరే కారణం వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులకు అంటకాగినవారికి స్థానచలనం కల్పిస్తున్నారన్న చర్చ నడుస్తోంది.

**సిఫార్సు లేఖలతో పోస్టింగ్‌లు పొందిన వారిపై దృష్టి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యట ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోగానే తన సెక్యూరిటీ వింగ్‌ను మార్చిన విషయం తెలిసిందే. గత సీఎం వద్ద పనిచేసిన సెక్యూరిటీ వల్ల రహస్యాలు బయటకు పొక్కుతున్నాయన్న ఉద్దేశంతో రేవంత్ భద్రతా సిబ్బందిని మార్చినట్లు సమాచారం. ఇదే క్రమంలో గత ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో పోస్టింగులు పొందిన వారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వీరిలో పలువురు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని స్థానాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేస్తూ బీఆర్ఎస్‌కు సహకరించిన సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారుల జాబితాలను ప్రభుత్వానికి అందజేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే బదిలీలు జరుగుతున్నాయన్న ప్రచారం ఉంది.

**సిఫార్సుతో వచ్చినవారిలో గుబులు**

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆదిభట్ల, యాదగిరిగుట్ట రూరల్ ఇన్‌స్పెక్టర్లను తొలుత బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావించినట్లు సమాచారం. అయితే చౌటుప్పల్, భువనగిరి, యాదగిరిగుట్ట ఏసీపీల పరిధిలోనూ కొందరు ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేయాలని సిఫార్సు లేఖలు అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 17 మందికి ఒకేసారి స్థానం చలనం కల్పించారు. త్వరలో మరికొందరు తమ స్థానాలను వీడనున్నట్లు తెలుస్తోంది. తాజా బదిలీల నేపథ్యంలో పోలీసు వర్గాల్లో కలవరం మొదలైంది. సిఫార్సు లేఖలతో పోస్టింగులు సంపాదించిన అధికారుల్లో గుబులు మొదలైంది.

**ఏసీపీలకూ స్థానచలనం తప్పదా?**

భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట సబ్ డివిజన్‌ల పరిధిలో ఏసీపీలు ఉన్నారు. సీఐలు, ఎస్‌ఐల బదిలీలు పూర్తయిన అనంతరం వారికి కూడా స్థానచలనం కలిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు బదిలీలు జరుగుతుండగానే మరో వైపు పోస్టింగ్‌ల కోసం పలువురు పోలీసు అధికారులు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**మూడేళ్లు పూర్తికాకున్నా ట్రాన్స్‌ఫర్**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒకే చోట మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారులను బదిలీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ, బదిలీ అయిన వారిలో రెండేళ్లు పూర్తికాని వారు కూడా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన పోలీసు అధికారుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా బదిలీ అయిన పోలీసుల్లో పలువురిని ప్రాముఖ్యత లేని పోస్టుకు పంపుతున్నట్లు ప్రచారం. కొందరు ట్రాఫిక్, సీసీఎస్, ఎస్‌బీ, ఎస్‌ఓటీ విభాగాలకు బదిలీ అవుతుండగా మరికొందరిని హెడ్‌కార్వర్టర్‌కు అటాచ్ చేస్తున్నారు.

**బదిలీ అయిన సీఐలు, ఎస్‌ఐలు**

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ |
|---|---|---|
| ఎం.మహేష్ | చౌటుప్పల్ రూరల్ సీఐ | ఎస్‌హెచ్‌ఓ, కుషాయిగూడ |
| ఏ.రాములు | ఎస్‌ఓటీ-1 | చౌటుప్పల్ రూరల్ సీఐ |
| మోతీరాం | రామన్నపేట సీఐ | సీసీఎస్ మల్కాజిగిరి |
| వెంకటేశ్వర్లు | సీసీఎస్ ఎల్‌బీనగర్ | రామన్నపేట సీఐ |
| వేణుగోపాల్‌రావు | స్పెషల్ బ్రాంచ్ | యాదగిరిగుట్ట రూరల్ సీఐ |
| బి.అశోక్‌రెడ్డి | ఎస్‌ఓటీ-2 | ఎస్‌హెచ్‌ఓ చౌటుప్పల్ |
| ఎస్.దేవేందర్ | చౌటుప్పల్ ఎస్‌హెచ్‌ఓ | షీ టీం |
| ఎం.ప్రభాకర్‌రెడ్డి | సైబర్ క్రైం | భువనగిరి రూరల్ సీఐ |
| సుధీర్‌కృష్ణ | భువనగిరిటౌన్ సీఐ | ఎల్‌బీనగర్ ట్రాఫిక్-2 |
| సురేష్‌కుమార్ | స్పెషల్‌బ్రాంచ్ సీఐ | భువనగిరి టౌన్ సీఐ |
| ఉపేందర్‌రావు | డీఐ మేడిపల్లి | భువనగిరి ట్రాఫిక్- 2 సీఐ |
| మహేందర్‌లాల్ | కుషాయిగూడ ట్రాఫిక్ | వలిగొండ ఎస్‌ఐ |
| ప్రభాకర్ | వలిగొండ ఎస్‌ఐ | కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్‌ఐ |
| విక్రంరెడ్డి | భూదాన్‌పోచంపల్లి ఎస్‌ఐ | సైబర్ క్రైం |
| లక్ష్మయ్య | రామన్నపేట ఎస్‌ఐ | చౌటుప్పల్ ఎస్‌ఐ |
| కె.రాజు | స్పెషల్‌బ్రాంచ్ ఎస్‌ఐ | బొమ్మలరామారం ఎస్‌ఐ |
| శ్రీనివాస్‌రెడ్డి | బొమ్మలరామారం ఎస్‌ఐ | చైతన్యపురి ఎస్‌ఐ |

## ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలి

- ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం
- యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో తనిఖీ



యాదాద్రి కొండపైన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ పురుషోత్తం

యాదగిరిగుట్ట: ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులతో స్నేహ పూర్వకంగా మెలగాలని హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. మహాలక్ష్మి పథకం కింద అమలవుతున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని పరిశీలించేందుకు శనివారం ఆయన యాదగిరిగుట్ట డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం యాదాద్రి కొండపైకి వెళ్లి దేవస్థానం సహాయంతో నడుస్తున్న ఉచిత బస్సుల విషయమై ఈఓ రామకృష్ణారావుతో సమావేశమయ్యారు. కొండపైకి నడిచే ఉచిత బస్సులను భక్తులు వినియోగించుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బస్టాండ్ వద్ద భక్తులకు రేలింగ్ సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కొండ కింద కొత్త బస్టాండ్‌ను పరిశీలించి, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క మహిళ మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అంతకు ముందు యాదాద్రీశుడిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయన వెంట నల్లగొండ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవి, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఆయా డిపోల అధికారులు, హైదరాబాద్ జోన్ ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి



మాట్లాడుతున్న ఆర్‌ఎల్ మూర్తి

భువనగిరిటౌన్ : విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 29న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచుతున్నామని ప్రకటించిందే తప్ప అమలు చేయలేదన్నారు. 16 నెలలుగా మెస్, కాస్మొటిక్ చార్జీలు, నాలుగు సంవత్సరాలుగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ రాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బుర్ర అనిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం సహాయ కార్యదర్శి కాసుల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా రాజు, నాయకులు వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- ఫిబ్రవరి 1నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు
- 54 కేంద్రాలు, 6,254 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



భువనగిరి : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఫిబ్రవరి 1నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 29నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రయోగ పరికరాలు చేరవేయనున్నారు. దీంతో పాటు సీఎస్, డీఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు ప్రతి కేంద్రానికి సబ్జెక్టుకు సంబంధించిన ఎగ్జామినర్‌ను నియమించనున్నారు. పరీక్షల కన్వీనర్‌గా డీఐఈఓ రమణి వ్యవహరించనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేస్తున్నారు.

**కేంద్రాలు ఇలా..**

ప్రాక్టికల్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో జూనియర్ కళాశాలల్లో 39, ఒకేషనల్ కాలేజీల్లో 19 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

**మూడు విడతలుగా పరీక్షలు**

ప్రాక్టికల్స్ పరీక్షలు మూడు విడతల్లో జరగనున్నాయి. మొదటి విడత ఫిబ్రవరి 1నుంచి 5వ తేదీ వరకు, రెండో విడత 6నుంచి 10వ తేదీ వరకు , మూడో విడత 11నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది. 6,254 మంది విద్యార్థులు హాజరు కానున్నాయి. వీరిలో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం 3,254 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం 1,548, సెకండియర్ విద్యార్థులు 1,452 మంది ఉన్నారు.

**పకడ్బందీ ఏర్పాట్లు**



ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు మూడు విడతల్లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి. ఇందు సంబంధించి ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. పరీక్ష కేంద్రాలకు సోమవారం నుంచి మెటీరియల్ పంపిణీ ప్రారంభిస్తాం. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. -రమణి, డీఐఈఓ

# ఆలేరు చైర్మన్ పీఠం బీఆర్‌ఎస్‌దే

**మున్సిపల్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం**

- 12 మంది సభ్యులకు ఐదుగురే హాజరు
- కోరం లేనందున తేలని ఫలితం
- అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించిన ఆర్డీఓ



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

సాక్షి, యాదాద్రి : ఆలేరు మున్సిపల్ చైర్మన్‌పై ఎనిమిది మంది సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శనివారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ అమరేందర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో 12మంది సభ్యులు ఉండగా కోరం కావాలంటే 8 మంది సమావేశానికి హాజరుకావల్సి ఉంది. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరుకావడంతో సమావేశాన్ని మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత కూడా సభ్యులు ఎవ్వరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ ప్రకటించారు. చైర్మన్ పదవీకాలం ముగిసే వరకు మరోసారి అవిశ్వాసం ఉండదన్నారు.

**అవిశ్వాసం ప్రకటించిన 8 మంది కౌన్సిలర్లు**

ఆలేరు మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ 8, బీజేపీ ఒకరు, కాంగ్రెస్ ఒకరు, ఇద్దరు ఇండిపెండెంట్‌లు ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ మొరిగాడి మాధవితో పాటు కౌన్సిలర్లు బేతి రాములు, దాసి నాగలక్ష్మి, కందుల శ్రీకాంత్, మొర్తాల సునీత, బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు సంగు భూపతి, చింతల ఫణి సునీత, ఇండిపెండెంట్ గుత్తా శమంత చైర్మన్ పస్పరి శంకరయ్యపై అవిశ్వాసం ప్రకటించారు. తీర్మానంపై సంతకాలు చేసి ఈనెల 6న కలెక్టర్‌కు అందజేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎ.దాయామణి, ఆర్.నర్సింహులు, ఇండిపెండెంట్ జూకంటి శ్రీకాంత్ చైర్మన్‌కు మద్దతుగా ఉన్నారు.

**హాజరైన సభ్యులు వీరే..**

మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి ఎనిమిది మంది కౌన్సిలర్లు హాజరు కావల్సి ఉంది. ఐదుగురు కౌన్సిలర్లు బేతి రాములు (బీఆర్‌ఎస్), కందుల శ్రీకాంత్ (బీఆర్‌ఎస్), చింతలపణి సునీత (కాంగ్రెస్), సంగు భూపతి (బీజేపీ), గుత్త శమంత (స్వతంత్ర) హాజరయ్యారు. కలెక్టర్‌కు అందజేసిన తీర్మాన పత్రంపై సంతకాలు చేసి ముగ్గురు కౌన్సిలర్లతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. కోరం లేకపోవడంతో ఆర్డీఓ అమరేందర్ సమావేశాన్ని మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశం ప్రారంభించిన తర్వాత కూడా సమావేశానికి ఐదుగురు సభ్యులకు మించి హాజరుకాకపోవడతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ ప్రకటించారు. చైర్మన్‌పై అవిశ్వాసం నేపథ్యంలో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

**'కౌన్సిలర్లు డబ్బుకు అమ్ముడుపోయారు'**

ఆలేరురూరల్ : మున్సిపల్ చైర్మన్ శంకరయ్యపై అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లలో ముగ్గురు డబ్బుకు అమ్ముడుపోయి సమావేశానికి హాజరుకాలేదని బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్ బేతి రాములు ఆరోపించారు. అవిశ్వాస తీర్మానం అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎనిమిది మంది కౌన్సిలర్లం అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు చేసి కలెక్టర్‌కు అందజేశామన్నారు. కానీ, ముగ్గురు హాజరు కాలేదని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చైర్మన్ శంకరయ్య అనేక అక్రమాలకు పాల్పడారని, భూకబ్జాలు చేశారని, వాటిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. ఆయన వెంట కౌన్సిలర్లు సంగు భూపతి, కందుల శ్రీకాంత్, చింతలపణి శ్రీకాంత్, గుత్త సమంత తదితరులు ఉన్నారు.

## బాల నేరస్తులకు న్యాయ సహకారం

- సివిల్ జడ్జి దశరథ రామయ్య



మాట్లాడుతున్న జడ్జి దశరథ రామయ్య

భువనగిరి క్రైం : బాల నేరస్తులకు న్యాయ సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య పేర్కొన్నారు. భువనగిరిలోని సబ్ జైలులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జైళ్లలో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా అధ్యక్షుడు జయరాజు సూచనల మేరకు ఫిబ్రవరి 27వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.జైపాల్, పారాలీగల్ వలంటర్లు కొడారి వెంకటేశం, బి.రాంబాయి, జైల్ సిబ్బంది అనీల్ పాల్గొన్నారు.

## మోత్కూరులో గ్యాస్ కష్టాలు



గ్యాస్ ఏజెన్సీ ఎదుట సిలిండర్లు లైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్న వినియోగదారులు

మోత్కూరు : పట్టణంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాం ఎదుట శనివారం వినియోగదారులు బారులు దీరారు. కొంతకాలంగా సకాలంలో గ్యాస్ రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో గ్యాస్ ఏజెన్సీకి పెద్ద ఎత్తున తరలివచ్చి పడిగాపులుకాశారు. బుక్ చేసిన వారం రోజులకు కూడా సిలిండర్ అందడం లేదని వినియోగదారులు వాపోయారు. కంపెనీ నుంచి సక్రమంగా గ్యాస్ సరఫరా కావడం లేదని కాంట్రాక్టర్ బుంగపట్ల యాకయ్య తెలిపారు. గత కొన్నాళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

# సాగర్‌లో అర్బన్ పార్కు ప్రారంభం

- జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో నిర్మాణం
- పర్యాటకులకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్ ఏర్పాటు
- అటవీ అందాల వీక్షణకు సఫారీ వాహనం కూడా..





నెల్లికల్లు వద్ద ఏర్పాటు చేసిన వ్యూపాయింట్, పర్యాటకులకు ఏర్పాటు చేసిన వాహనం

**నాగార్జునసాగర్:** సాగర్ జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీకోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును శనివారం అటవీశాఖ అధికారులు ప్రారంభించారు. నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల) వెంట 980 హెక్టార్ల విస్తీర్ణంలో పర్యాటకులను ఆకట్టుకునేలా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. 50మంది ఒకేచోట కూర్చొని తినడానికి గజాబాను నిర్మించారు. అటవీ ప్రాంతంలో పార్కు చుట్టూ 2కిలో మీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గుట్టల్లోంచి పచ్చని వృక్షాల మధ్య గల సాగర్ జలాశయం వెనుక వైపున గల అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్‌ను ఏర్పాటు చేశారు.

**ట్రిప్పుకు రూ.1,000లనుంచి రూ1,500లు**

పర్యాటకులు అటవీ అందాలను వీక్షించేందుకు సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒక ట్రిప్పులో 8నుంచి 10మంది వెళ్లనున్నారు. ఇందుకు 10కిలో మీటర్ల పరిధికి రూ.1,000 చార్జీ అవుతుండగా 24కిలో మీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500లు చార్జీ వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అడవిలో వివిధ రకాల జంతువులు కనిపిస్తున్నాయని పర్యాటకులు పేర్కొన్నారు. రూ.వెయ్యి, 1500 ఒక కుటుంబ సభ్యులు చెల్లించగలిగితే వారికి ప్రత్యేకమైన ట్రిప్పులు వేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రోజు నాలుగు ట్రిప్పులు నడపగా రూ.4వేల ఆదాయం వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

# 64కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- సొత్తు విలువ రూ.32.30 లక్షలు

**చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద 64కిలోల గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గంజాయిని కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గంజాయితోపాటు రవాణాకు వినియోగించిన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చేపల విక్రయదారుడిగా ఉన్న కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లా తన్నియాం గ్రామానికి చెందిన పీహెచ్. ఫవాస్(29), భవన నిర్మాణ కార్మికుడైన అదే రాష్ట్రంలోని తిరువనంతపురం జిల్లా వెంగనూర్ గ్రామానికి చెందిన అనంతుమోహన్(25), బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మల్లాపురం జిల్లాలోని కలకప్పర గ్రామానికి చెందిన సయ్యద్(39)లు కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన గంజాయి సరఫరాదారుడితో వేర్వేరుగా పరిచయం ఏర్పర్చుకున్నారు. వారంతా ముఠాగా ఏర్పడి గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

**అరకు ప్రాంతంలో కొనుగోలు**

బెంగళూరుకు చెందిన ప్రధాన నిందితుడి సూచన మేరకు ముగ్గురు నిందితులు గంజాయి రవాణాకు బయలుదేరారు. అందులో భాగంగా గంజాయి సరఫరా కోసం వినియోగించాల్సిన కారును తీసుకొని ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సరఫరాదారుల వద్ద కొనుగోలు చేసిన 64కిలోల గంజాయిని కారులో నింపి అక్కడి నుండి తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోయారు.

**అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు**

కొనుగోలు చేసి రవాణాకు కారులో సిద్ధంగా ఉంచిన గంజాయిని అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలించాలనేది నిందితుల పన్నాగం. ఆ ప్రకారంగా ముగ్గురు నిందితులు మరోకారులో ఈనెల 26న అరకుకు చేరుకున్నారు. సరుకు ఉన్న కారుకు మరోకారు ఎస్కార్ట్‌గా పెట్టుకొని బయలుదేరారు. తాము వెళ్లే మార్గంలోని పోలీస్‌స్టేషన్లు, చెక్‌పోస్టుల వివరాలను తెలుసుకుంటూ శుక్రవారం రాత్రి హైవేపై పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అందులో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయిని తరలిస్తున్న కారు చిక్కింది. అదే సమయంలో ఎస్కార్ట్ వాహనాన్ని సైతం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన సొత్తు విలువ 32.30లక్షల రూపాయలుగా పోలీసులు అంచనా వేశారు.

## యాదాద్రిలో భక్తుల కోలాహలం

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. శనివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారిని 40వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు 3గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. వివిధ పూజలతో స్వామివారికి నిత్య ఆదాయం రూ.55,43,899 వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆలయ సన్నిధిలో భక్తుల రద్దీ



# సైదన్నా.. వెళ్లొస్తాం

## ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

- దీపారాధనతో ముగిసిన ఉత్సవాలు
- చివరి రోజు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకున్న భక్తులు



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ముజావర్ జానీ

**పాలకవీడు:** జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన ఉత్సవాలు శనివారం ముజావర్ జానీ ప్రత్యేక ప్రార్థనల అనంతరం దీపారాధనతో దీపారాధనతో ముగిశాయి. ఉత్సవాలకు చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సైదన్నా.. వెళ్లొస్తామంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

**విధుల్లో కొనసాగిన అధికారులు..**

ఉర్సుకు ఊహించిన దానికంటే భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో అధికారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. నిరంతరం దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం తొగించేందుకు ప్రైవేటు కార్మికులను నియమించి పనులు చేపట్టారు. దర్గా ప్రాంగణంలో అధికారులు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక శిబిరాలను తొలగించారు. ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలకు అధికాదాయం లభించింది. మూడు డిపోలకు కలిపి సుమారు రూ.11 లక్షలకు పైగా ఆదాయం లభించినట్లు ఆయా డిపోల మేనేజర్లు వెల్లడించారు.

## ఆలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



అర్వపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కార్తీక్

**సూర్యాపేట రూరల్, అర్వపల్లి:** అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, తిమ్మాపురంలోని అఖండ జ్యోతిస్వరూప సూర్య నారాయణస్వామి క్షేత్రంతో పాటు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని శివాలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ పుల్ల కార్తీక్ సందర్శించారు. ఎరకేశ్వర, నామేశ్వర, త్రికుటేశ్వరాలయాలను దర్శించి పూజలు చేశారు. అర్వపల్లి ఆలయంలో జడ్జిని జెడ్పీటీసీ, న్యాయవాది దావుల వీరప్రసాద్‌యాదవ్ సన్మానించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ కృష్ణయ్య, డీఎస్పీ నాగభూషణం, సీఐ అశోక్, రూరల్ ఎస్ఐ సాయిరాం, న్యాయవాది కుంభం రణధీర్, ఎస్ఐ అంజిరెడ్డి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్, సూర్య క్షేత్రం వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



సండే స్పెషల్

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నాడో కవి. స్వయంకృషితో ఆ ఇద్దరు యువకులు ఆదర్శ కృషీవలురుగా మారారు. ఉన్నత చదువులను పక్కనపెట్టి ఒకరు, ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని మరొకరు పొలం బాట పట్టారు. వ్యవసాయ రంగంలో అందివస్తున్న ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకుని మార్కెట్‌లో ధర ఉన్న పంటలను పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం వీరికి అండగా నిలవగా తమతోపాటు పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

-నల్లగొండ డెస్క్



తాను సాగుచేస్తున్న చామంతి పూల తోటలో బిచ్చునాయక్

# యువసాయం

## సాగులో విద్యావంతుల వినూత్న ఒరవడి

- ఉద్యోగం వదిలి ఒకరు.. ఉన్నత చదువులు చదివి మరొకరు
- సరికొత్త ఆలోచనలతో పంటల సాగు
- సొంతంగా మార్కెటింగ్‌తో లాభాల బాట
- అవార్డులు సైతం పొంది ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతులు

### పాలీహౌస్‌లో పూల తోట

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన భూక్య బిచ్చునాయక్ 2012లో బీటెక్ బయోటెక్నాలజీ పూర్తి చేశాడు. 2018 వరకు ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. కానీ, ఫలితం లేకపోవడంతో ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా వ్యవసాయ రంగం వైపు దృష్టిసారించాడు. సంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, వేరుశనగ, వరిసాగు వైపు కాకుండా వినూత్న ఆలోచన చేశాడు. పాలీహౌస్‌లో పూల సాగు చేసేందుకు నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో పర్యటించి పంటసాగు, దిగుబడి, మార్కెంటింగ్ తదితర అంశాలపై రైతుల నుంచి సమాచారం సేకరించాడు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను తెలుసుకొని తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలో తనకున్న 12 ఎకరాల్లో.. ఎకరం భూమిలో పాలీహౌస్ ఏర్పాటు చేశాడు. ఈ పాలీహౌస్ ఏర్పాటుకు ప్రభుత్వం 95శాతం సబ్సిడీ ఇచ్చింది. పాలీహౌస్‌లో అలంకరకణ పూలైన లేత గులాబీ, తెలుపు, పసుపు, ఎరుపు రంగు లాంటి చామంతిని సాగు చేస్తున్నాడు. మంచి లాభాలు గడిస్తూ.. మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. గతేడాది జాతీయ ఉత్తమ మిలినీయర్ రైతు–2023 అవార్డును సైతం అందుకున్నాడు.



జాతీయ ఉత్తమ మిలినీయర్ అవార్డును అందుకుంటున్న బిచ్చునాయక్ (ఫైల్)



పాలీహౌస్

**ఎకరాకు రూ.6 లక్షల ఆదాయం**

బిచ్చునాయక్ తన పాలిహౌస్‌లో నాటేందుకు చామంతి మొక్కలను రూ.2కు ఒకటి చొప్పున మహారాష్ట్రలోని నాసిక్ నుంచి తెప్పించాడు. ఎకరంలో మొత్తం 1,60,000 మొక్కలతో సాగు ప్రారంభించాడు. ప్రస్తుతం ఆయనే మొక్కలు తయారు చేసుకుంటున్నాడు. ఫామ్‌పాండ్ ద్వారా మొక్కలకు నీటిని అందిస్తున్నాడు. ఎకరా సాగుకు మొత్తం ఖర్చు రూ.6,20,000 వస్తుందని.. పూల విక్రయంతో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వస్తాయని.. దీనిలో పెట్టుబడి పోను ఎకరాకు సుమారు రూ.5 నుంచి 6లక్షల వరకు మిగులుతాయని బిచ్చునాయక్ పేర్కొన్నాడు.

> **యువత వ్యవసాయం వైపు రావాలి**
>
> యువత ఉద్యోగాల కోసం చూడకుండా స్వయం ఉపాధి సాధించేందుకు వ్యవసాయ రంగంవైపు రావాలి. నిరుద్యోగం కారణంగానే 2018లో నేను వ్యవసాయం వైపు వచ్చాను. పాలీహౌస్ ద్వారా పూలమొక్కలు సాగుచేయడానికి ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం బాగుంది. చామంతి పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. చామంతి పూలు ఒకేసారి కోతకు వస్తాయి. దీంతో మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఉండవు.
>
> – భూక్య బిచ్చు, రైతు, రాజానాయక్‌తండా

### సాఫ్ట్‌వేర్ నుంచి సాగుబడి వైపు



మిరప పంటకు సేంద్రియ ద్రావణం స్ప్రే చేస్తున్న యువరైతు బాలకృష్ణ


నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ బాలకృష్ణది వ్యవసాయ కుటుంబం. బాలకృష్ణ హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాడు. ఆ తరువాత విప్రో సంస్థలో రేడియో ఫ్రిక్వెన్సీ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. కరోనా సమయంలో ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి సాగుపై మక్కువ పెంచుకున్నాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నాడు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బాలకృష్ణకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరిచందన ఉత్తమ రైతు పురస్కారాన్ని అందజేశారు.

**రసాయన ఎరువులతో ప్రారంభించి..**

బాలకృష్ణ మొదటగా 2020లో రెండు ఎకరాల్లో మిర్చి, నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అందరిలాగానే రసాయన ఎరువులు వాడాడు. వచ్చిన పంట మొత్తం పూర్తిగా పెట్టుబడులకే సరిపోయింది. దీంతో సేంద్రియ ఎరువులతో పంటను సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్ ఛానల్స్ చూసి సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకున్నాడు. తర్వాత వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు.

**సేంద్రియ పద్ధతిలో పెట్టుబడి తక్కువ..**

బాలకృష్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు. సాధారణంగా మిర్చి పంటను రసాయన ఎరువులతో పండిస్తే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. అందుకు ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మిర్చి పంట ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడి ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10 వేలు మాత్రమే రావడంతో.. ఎకరానికి రూ.3 లక్షల వరకు లాభం పొందుతున్నాడు.



జీవ ఎరువులు తయారు చేస్తున్న బాలకృష్ణ

**సొంతంగానే మార్కెటింగ్**



బాలకృష్ణ తయారు చేసిన కారం ప్యాకెట్లు

సాధారణంగా మార్కెట్లో కిలో మిర్చి రూ.200 నుంచి రూ.250 వరకు ఉంటుంది. కానీ, సేంద్రియ పద్ధతిలో పండించిన ఈ మిర్చిని బాలకృష్ణ రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్, ఇతర నగరాల్లో నివసిస్తున్న వారికి తానే కారం పొడి తయారు చేసి కిలో రూ.500కి అమ్ముతున్నాడు.

> **సేంద్రియ వ్యవసాయం చేయాలి**
>
> 
>
> ప్రస్తుతం మనం తినే ప్రతీది రసాయనాలతోనే ముడిపడి ఉంది. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి అనారోగ్యం బారిన పడుతున్నాం. రైతులు ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలను పండించాలి. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడులు కూడా తగ్గుతాయి.
>
> – బాలకృష్ణ, యువరైతు

# నలుగురు విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారమే కారణం

**అనంతగిరి(కోదాడ):** కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో 57మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. శనివారం 37మంది విద్యార్థులు పాఠశాలకు హాజరై మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు అన్నం, వంకాయ కూర, చారు వడ్డించారు. కొద్ది సేపటి తర్వాత నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి కొత్తపల్లి సాత్విక్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ మార్గమధ్యలో స్పృహ తప్పి పడిపోయాడు. అనంతరం ఐదో తరగతి విద్యార్థి బొడ్డుపల్లి బాలు తీవ్ర కడుపు నొప్పితో బాధపడ్డాడు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా కోలుకున్నారు. వీరితో పాటు మూడో తరగతి విద్యార్థిని నకిరెకంటి విజయ, ఐదో తరగతి విద్యార్థి కోకల సంజయ్‌కి వాంతులయ్యాయి. విద్యార్థుల అస్వస్థతకు కలుషిత ఆహారమే కారణమని మండల వైద్యాధికారి రంజిత్ తెలిపారు. విద్యార్థుల అస్వస్థత విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ సలీం షరీఫ్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలల పురుగులు పట్టిన బియ్యాన్ని మార్చాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఫోన్‌లో ఆదేశించారు.

**పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన**

కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారానికి బదులు కలుషిత ఆహారం పెట్టి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంఈఓ సలీం షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. బాత్‌రూంలు కూడా సరిగా లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు వండిన ఆహారాన్ని ముందుగా ఓ ఉపాధ్యాయుడు తినాలని, ఆతర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ ఆదేశించారు. అధే విధంగా పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**మోత్కూరు :** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం గ్రామ స్టేజి వద్ద చోటు చేసుకుంది. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ, యాదయ్య దంపతుల చిన్న కుమారుడు ఎర్రవెల్లి పరశురామ్ (32) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పరశురామ్ శుక్రవారం స్వగ్రామం కొండగడపకు వచ్చి రాత్రి తిరిగి వరుసకు సోదరుడైన ఎర్రవెల్లి నరేష్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నరేష్ నడుపుతున్న బైక్ అదుపు తప్పి కిందపడటంతో పరశురామ్ కిందపడి మృతి చెందగా నరేష్‌కు గాయాలయ్యాయి. మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన నరేష్‌ను హైదరాబాద్‌లోని కాకతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు పరశురామ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

**యాదగిరిగుట్ట రూరల్ :** రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పధూమ్ లాల్ బంజారే (37) కాచిగూడ నుంచి స్వరాష్ట్రానికి వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు రైల్వే గేట్ సమీపానికి రాగానే ఆ వ్యక్తి రైలులో నుంచి జారి క్రింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ పోలీసులు వివరాలు సేకరించి కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

**యాదగిరిగుట్ట రూరల్:** ఉరివేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదగిరిగుట్ట మండలం గ్రామానికి చెందిన పుచ్చుల మధు (21) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తమ వ్యవసాయ బావి వద్ద తాడు సహాయంతో చెట్టుకు ఉరివేసుకున్నాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వచ్చిన తన తండ్రి జహంగీర్ ఉరివేసుకున్న కొడుకును చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.